# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ మధ్యాహ్నం కనకదుర్గమ్మకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.**
2. **రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు.**
3. **కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు.**
4. **రాష్ట్రాభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.**
5. **ఈరోజు ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. విద్య అధిదేవత అయిన సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా సర్వవిద్యలలో విజయం సాధిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా దసరా మహోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో ఈ రోజు భ్రమరాంబికాదేవి అమ్మవారు కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే గజవాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు.

-------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను ఈరోజు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. రాష్ట్ర హోం శాఖమంత్రి వి. అనిత, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కె.శివనాధ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ మధ్యాహ్నం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

-------------------------

రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ముంబైలో ద్రవ్య పరపతి విధాన కమిటీ–ఎంపిసి సమావేశ నిర్ణయాలను ఈరోజు పాత్రికేయులకు వివరించారు. వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నామని, 2024–25లో వాస్తవ స్థూల దేశీయోత్పత్తి జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతంగా అంచనా వేస్తున్నామని చెప్పారు. మెరుగైన వర్షపాతం నమోదు, సరిపడా నిల్వలతో ఈ ఏడాది చివరికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని అన్నారు. యూపీఐ లైట్ వాలెట్ పరిమితిని 2 వేల నుంచి 5వేల రూపాయలకు పెంచుతున్నామని వివరించారు.

---------------------------

కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ తెలిపారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే అంశంపై ఈ రోజు విజయవాడలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు సలహాలు, సూచలు స్వీకరించి కాలుష్య నివారణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలుపుతూ,

వాయిస్ (33 సెకన్లు)

---------------------------

కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై జిల్లా స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ప్రజాప్రనిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ...

వాయిస్ ( 35 సెకన్లు )

---------------------------

తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు మలయప్ప స్వామి వారు కోదండ రాముని అవతారంలో ధనుస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ రోజు సాయంత్రం వేళ స్వర్ణ రథంపై ఊరేగింపు జరగనుంది. అనంతరం రాత్రి గజవాహన సేవను నిర్వహిస్తారు.

---------------------------

రాష్ట్రంలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల చేసి 40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని కొత్త జిల్లాల ప్రాతిపదికన 6 వేల 219 సాగునీటి సంఘాలు, 252 డిస్ట్రిబ్యూటరీలు, 56 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

---------------------------

ప్రజల దైనందిన జీవితంలో తపాలా సేవల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈరోజు ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. స్విట్జర్లాండ్ దేశంలో బెర్న్ పట్టణంలో 1874 అక్టోబర్ 9వ తేదీన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్థాపనకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 9వ తేదీన ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తపాలా సేవల ఆవశ్యకతను తెలియజేస్తూ... దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర తపాలా శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది.

---------------------------

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రతా సహకారాన్ని విస్తరించే క్రమంలో విశాఖ సముద్ర తీరంలో తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో అంతర్జాతీయ నావికా విన్యాసాలు - మలబార్ 2024ను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు దేశాల నావికాదళ ఉన్నతాధికారులు విశాఖ చేరుకున్నారు. ఈ అంశంపై మరింత సమాచారాన్ని మా విశాఖపట్నం ఆకాశవాణి ప్రతినిధి వి.ఎస్. మూర్తి అందిస్తారు.

వాయిస్ (42 సెకన్లు)

---------------------------

జల్ జీవన్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి జనమన్ పథకం ద్వారా రాష్ట్రంలోని 332 గిరిజన గ్రామాలకు సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇందుకు 2 వేల 993 కోట్ల రూపాయలను వినియోగించేందుకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు తెలుపుతూ ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. ఈ వంద రోజుల్లో విద్యా, ఆరోగ్యం గురించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ లైఫ్– పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమాలను తిరుమల, తిరుపతిలలో అమలు చేయనున్నామని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ –బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ మేరకు నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నిత్యం భక్తులు తిరుపతి వస్తుంటారని, ఇక్కడికి వచ్చే యాత్రికులకు జీవితంలో విద్యుత్ పొదుపు పాటించడంపై బీఈఈ ప్రచారం కల్పించనుందని తెలిపారు.

=====================